# రావు బాలసరస్వతిదేవి

తిన్నెమీద చిన్నోడ  వన్నెకాడా

తేనె తుట్టిలాంటి  ఓ చిన్నవాడా

నిన్నుగన్న నాటినుండి  నీటుకాడా

అన్నమే రుచికాదు  అందగాడా

వన్నె వన్నె వగమారి  వన్నెకాడా

నిన్నిడిచి ఉండలేను  చిన్నోడా

నలుగురిలో  నన్ను నాణెకాడా

నగుబాటు చేయబోకు  నోగ్గాడా

పసగల దాననోయ్  మోసుకాడా

పట్టుకుంటే  విడవనోయ్ చక్కనోడా...

తెలుగు  సినిమా చరిత్రలో తొలిసారిగా నేపథ్యంగా ప్లేబాక్‌గా వినిపించిన పాట ఇదేనని  విమర్శకుల అభిప్రాయం. దీన్ని పాడినవారు రావు బాలసరస్వతిదేవి. పున్నమి  వెన్నెల, తీయతేనె,  కోకిల కలకూజితం,  మంచిగంధపుపొడి,  మల్లెపూల పరిమళం,  గులాబీ రేకుల మార్దవం... ఇవన్నీ రంగరిస్తే... ఎలా ఉంటుంది... అంటే  బాలసరస్వతీదేవి స్వరంలా ఉంటుంది!

''ఆ తోటలో నొకటి, ఆరాధనాలయము, ఆ ఆలయములోని, అందగాడెవరో'' అన్న పాట విని ఆనాటి శ్రోతలు మైమరిచిపోయారు. స్వయంగా గుడిపాటి వెంకటచలం ఆ పాట విని బెంగెట్టుకున్నారు. ఆయన మాటల్లోనే చెప్పాలంటే- ''తక్కిన పాటకంతా ఏం? ఆ అందగాడెవరే అని మూడుసార్లు అంటారు ఆమె. నా కళ్ళ ఎదుట ఓ చిత్రపటం కనిపిస్తుంది. మధ్యాహ్నం గొప్ప హర్మ్యంతో, పర్పుల్ మొహమల్ తెరల మధ్య, అందమైన దుప్పట్లమీద, పరిమళాలలో నిద్రపోయి, తగ్గిపోయే ఎండకాంతిలో కళ్ళు తెరచి, అందంగా చేతులు పైకి జాచి, వొళ్ళు విరుచుకుని, చాలా బద్ధకంగా 'ఆ అందగాడెవరే?'' అని అడుగుతున్నట్టు వినిపిస్తుంది. ఆమె- అంటే బాలసరస్వతిగారెవరో ఆమె కాదు. నా మనసులోని కావ్యనాయకి ఎప్పుడూ అతని దగ్గరికి వెళ్ళదు. అట్లా బద్ధకంగానే, సఖితో 'ఆ అందగాడెవరే?'' అని ఏళ్లకొద్దీ అడిగి, కలలు కంటోవుంటుంది. చివరికి ఎప్పుడో వాణ్ణి ఓసారి ఇటు రమ్మను- అంటుంది, అంత బద్ధకంగానూ. వొస్తాడో రాడో అతని అదృష్టం ఇంక''...

డా. నండూరి రామమోహనరావు రాసినట్లు- ''అప్పటిలో ఆంధ్రదేశంలోని యువతీ యువకులెందరో చలంగారికంటె ముందుగానే, చలంగారిలాగానే, ఆ పాట మాధుర్యం మీద బెంగెట్టుకున్నారు. ఇప్పటికీ ఆ పాట వింటుంటే రసవివశులైపోయేవారు అన్ని తరాల శ్రోతలలోనూ వున్నారు''! నిజమే బాలసరస్వతీదేవి గొంతు అంత మంత్ర మోహనం!

రావు బాలసరస్వతీదేవి 1928 ప్రాంతంలో గుంటూరులో పుట్టారు. నాలుగేళ్ల వయసులో మద్రాసు మహానగరంలో నాటకం చూస్తూ తండ్రి ఒడిలో కూర్చున్న ఆమె, వేదికమీద పాడుతున్న వారిని చూసి తానూ పాడతానని అల్లరి చేయడంతో ముఖ్యఅతిథి కపిలవాయి రామనాథశాస్త్రి ఆమెను వేదికమీదికి తీసుకెళ్ళి పాడమన్నారు. ''నమస్తే నా ప్రాణనాథా''... అనే పాటని ఏ మాత్రం జంకు గొంగూ లేకుండా వినసొంపుగా పాడుతున్న ఆ చిన్నారిని అందరూ ఆశీర్వదించారు. చిత్రమేమిటంటే ఆమె ఆరేళ్లకే గ్రామఫోను రికార్డుకోసం పాడారు. అది ఓగిరాల రామచంద్రరావు ప్రోత్సాహంతో పాడిన ''పరమపురుష పరంధామ''. ఏడేళ్ల వయసులో సినిమాల్లో నటించడం, పాటలు పాడడం ఆమె జీవితంలో భాగం అయింది. 'సతీ అనసూయ'లో గంగ పాత్రవేసి

''ఏది దారి నా కిచటా'' అని 1935లో పాడారు. ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి పాట 'సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్, వ్యష్టి జీవము చేదు పానీయమోయి'', సాలూరి సన్యాసిరాజు రాసిన ''ఆ తోటలోనొకటి ఆరాధనాలయము'', సత్య రాసిన పాట ''బంగారు పాపాయి బహుమతులు పొందాలి''... ఈ మూడు గీతాలు అప్పట్లో ఇంటింటా మారుమోగాయి! పదిహేను సంవత్సరాలొచ్చేసరికి పదమూడు సినిమాల్లో నటించారు. అందులో 'పృథ్వీరాజ్' అనే చిత్రంలో ఎం.జి.రామచంద్రన్‌తో కలసి నటించారు. చిన్నతనంలో ఆలత్తూరు సుబ్బయ్య వద్ద మూడు సంవత్సరాలు సంగీతం నేర్చుకున్నారు. ఆ తర్వాత చాన్నాళ్లకి సుప్రసిద్ధ సంగీత దర్శకుడు వసంత్ దేశాయ్ దగ్గర హిందుస్థానీ సంగీతంలో మెలకువలు తెలుసుకున్నారు. డేవిడ్ అనే పాశ్చాత్య సంగీత దర్శకుడివద్ద పియానో అభ్యసించారు. బాలసరస్వతీ తండ్రికి, కొప్పరపు సుబ్బారావు మంచి స్నేహితుడు. అందువల్ల ఆరేళ్ల వయసులో ఆయన ప్రోత్సాహంతో హెచ్.ఎం.వి.లో పాడించారు. కుచేల-ప్రహ్లాద అనే జంటనాటకాలను ఓగిరాల రూపొందిస్తున్నారు. కుచేలలో 'ఆకలి సహింపజాలనే' ప్రహ్లాదలో 'దొరికె, దొరికె నాకూనేటికి శ్రీవారి దర్శనము' వంటి

గీతాలు పాడించారు. అయితే 'పరమపరుష పరంధామ' పాటని సోలో రికార్డుగా విడుదల చేశారు! ఆ పాటలు విన్న దర్శకులు సి.పుల్లయ్య తన చిత్రం ''సతీ అనసూయ''కి బుక్ చేశారు. దానికి ఆకుల నరసింహారావు సంగీత దర్శకులు. ఆ సినిమా కలకత్తా ఈస్టిండియా స్టూడియోలో జరగడంతో అక్కడ ప్రసిద్ధులైన కె.ఎల్.సైగల్, కె.సి.డే వంటి గాయకులు వచ్చేవారు. వారంతా చిన్నమ్మాయి అయిన బాలసరస్వతీదేవని ముద్దుచేసి పాలు పాడించి ఆనందించేవారు! అక్కడే తమిళ దర్శకుడు కె.సుబ్రహ్మణ్యం ఆమెను ''కుచేల'' సినిమాకి తీసుకున్నారు. అందులో ఆమెది కృష్ణపాత్ర. ఇల్లాలు, అపవాదువంటి సినిమాల్లో నటిస్తూనే పాడారు! తమిళ సినిమా ''డాన్సింగ్ గరల్''లో కథానాయిక ఆమే!

చిత్తూరు నాగయ్య తీసిన ''భాగ్యలక్ష్మి'' సినిమాలో కమలా కోట్నీస్‌కి నేపథ్యగానం చేశారు. ఆ పాటే- ''తిన్నెమీద చిన్నోడా...''. మాయా మచ్ఛీంద్రా సినిమాలో ''వినవోయీ హృదయాలాపన'' అనే పాటని మాలతికోసం పాడారు. తెలుగు సినిమాల్లో తొలి నేపథ్యగాయని బాలసరస్వతిదేవి. ఆ రోజుల్లోనే సాలూరు రాజేశ్వరరావుతో కలసి ప్రయివేట్ ఆల్బమ్‌లు ఇచ్చారు.

అలా వచ్చినవే ''పొదరింటిలో నుండి, రావే రావే కోకిలా, ఆ తోటలో...'' వంటి గీతాలు. రాజేశ్వరరావుతో కలిసి పాడిన ''పాట పాడుతూ కృష్ణా, కలగంటి కలగంటి కలువరేకుల వంటి కనులు గలవాని...'' వంటి గీతాలు విశేష ఆదరణ పొందాయి.

1944లో బాలసరస్వతీదేవి తల్లిదండ్రులతో కలసి మద్రాసు రేస్‌కోర్సుకు వెళ్తే. అక్కడ కోలంక జమీందారు రావు ప్రద్యుమ్నకృష్ణ మహీపతి సూర్యారావు చూశారు. మంచిరోజు చూసుకొని ఆమె ఇంటికి వెళ్లారు. పాట పాడమంటే ''కలగంటి కలగంటి'' అనే పాట పాడారు. తన గురించే అనుకొని ఆయన పట్టుబట్టారు. పెళ్లయిపోయింది. ఆ తర్వాత నాలుగేళ్లు మద్రాసులో ఉండి ఆ తర్వాత కోలకం వెళ్లారు. 1974 వరకు అక్కడే ఉన్నారు. ఆ సంవత్సరం రాజా కీర్తిశేషులయ్యాక 1994 వరకు ఆమె మైసూరులో ఉన్నారు. బాలసరస్వతీదేవి తెలుగులో అప్పటి ప్రముఖ సంగత దర్శకులందరితోనూ కలసి పనిచేశారు. ''చెంచులక్ష్మి' సినిమాలో తొలిసారి సుబ్బురామన్ సంగీత దర్శకత్వంలో పాడారు. 'దేవదాసు' చిత్రంలో ''తానే మారెనా, గుణమ్మే మారెనా'' . . . పాట ఇప్పటికీ వినిపిస్తుంది.

ఆయన చిత్రాలన్నిటిలో పాడారంటారు. రమేష్‌నాయుడు చిత్రరంగంలోకి వచ్చిన కొత్తలో ఆమెచేత ఎన్నో పాటలు పాడించారు. ''దాంపత్యం'' చిత్రంలో ఆమె అయిదు పాటలు పాడారు. సంగీత దర్శకుడు వేణుకి పాడారు. పెండ్యాల నాగేశ్వరరావు సంగీత దర్శకత్వంలో ''సృష్టిలో తీయనిది స్నేహమేనోయీ'' ప్రైవేట్ ఆల్బమ్ తెచ్చారు. అది అప్పట్లో సూపర్‌హిట్.సీనియర్ పాత్రికేయులు వాసుదేవరావు మాటల్లో చెప్పాలంటే- ''బాలసరస్వతీదేవి సినిమా పాటలన్నీ పాపులర్ అయినా ఆమె ప్రైవేట్ సాంగ్స్, లలిత గీతాలు ఎక్కువ ప్రజాదరణ పొందాయి''. నిజమే... దానికొక ఉదాహరణ 'బంగారు పాపాయి బహుమతులు పొదాలి'' గీతమే! ఆమె పెద్దబ్బాయిని ప్రసవించినపుడు మంచాల జగన్నాథరావు ఆ పాట రాసి బహూకరించారట! సాలూరు రాజేశ్వరరావు సంగీత దర్శకత్వంలో, వారి సోదరుడు సాలూరు హనుమంతరావు సంగీత దర్శకత్వంలోనూ ఆమె పాడారు. ఆచార్య సి.నారాయణరెడ్డి తెలుగులో తిరగరాసిన మీరా పాటల్ని ఆమె మధురంగా గానం చేశారు. 1940లో తొలిసారి మదరాసు రేడియోల్లో లలిత సంగీతం పాడారు. ఆ తర్వాత 1948లో విజయవాడలో రేడియో కేంద్రం ప్రారంభమైనపుడూ

ఆమే పాడారు. 1998లో విజయవాడ కేంద్రం స్వర్ణోత్సవాలు జరిగినపుడు  మళ్లీ పాడారు. ఆమె స్వరంలోఎ ఓ మత్తుంది. గమ్మత్తుంది. కలల గలగల ఉంది.  యవ్వన ఆకర్షణ ఉంది. మధురలోకాలకు,   మనోజ్ఞతీరాలకు మనల్ని వెంటనిడుకొని తీసుకెళ్ళే మాధుర్యం ఉంది.

– *చీకోలు సుందరయ్య*